సాక్షి
వికారాబాద్



శివ మాలధారుల ధర్నా
యాలాల మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో మంగళవారం సాయంత్రం శివస్వాములు ధర్నాకు దిగారు. 8లో▸



బోనం.. శోభాయమానం
ధారూరు మండలం దోర్నాల్‌లో గ్రామ దేవతలైన మైసమ్మ, ఊరడమ్మ, పోచమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 8లో▸



జంతువులను హింసించొద్దు
జంతువులపై కరుణ చూపాలని, వాటిని హింసించకూడదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. 9లో▸

బుధవారం। 1। ఫిబ్రవరి। 2023

న్యూస్‌రీల్

తాండూరులో మూడు రోజులు నీటి సరఫరా బంద్

తాండూరు టౌన్: మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కారణంగా తాండూరు మున్సిపల్ పరిధిలో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోనుందని మున్సిపల్ డీఈఈ వెంకటరంగనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు సరఫరా ఉండదని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

పథకాల అమలులో బీఆర్‌ఎస్ ముందంజ



పరిగి రెండో వార్డులో కంటి వెలుగు పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కంటివెలుగు పథకంతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలోని 2వ వార్డు ప్రేమ్‌నగర్, తొండుపల్లిలో ఏర్పాటు చేసిన నేత్ర శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కంటివెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి విడతలో ఎంతో మందికి చూపు సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ప్రస్తుత రెండో విడతలో ప్రభుత్వం విస్తృతమైన సేవలు అందిస్తోందని వివరించారు. సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. అన్నివర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ఎంపీడీఓ శేషగిరిశర్మ, కౌన్సిలర్ అర్చన, నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ప్రవేశాలకు మరో అవకాశం

వికారాబాద్ అర్బన్: డైట్ కాలేజీల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఈఈ సెట్ 2022 రెండేళ్ల కోర్సులో చేరేందుకు మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు వికారాబాద్ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ రామాచారి తెలిపారు. ఈ నెల 3న వికారాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారు 6 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలని, 14న సీట్లు కేటాయిస్తామని స్పష్టంచేశారు. 14 నుంచి 17వ తేదీలోపు ఫీజు చెల్లించి, 21లోపు అలాట్‌మెంట్ లెటర్‌తో వచ్చి, కాలేజీలో సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు.

11న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

అనంతగిరి: వికారాబాద్ కోర్టులో ఈ నెల 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నచిన్న తగాదాలకు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. లోక్‌అదాలత్‌లో రాజీ పడిన కేసుల్లో ఇద్దరూ గెలిచినట్లేనని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి డీబీ శీతల్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు దుద్యాల లక్ష్మణ్, గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, రఫీ, అశోక్‌కుమార్, లవకుమార్, సంపూర్ణ ఆనంద్, బస్వరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

హుడాకాంప్లెక్స్: నిరుద్యోగ యువత ప్రస్తుత పోటీని సమర్థవంతంగా ఎదుర్కొని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. సరూర్‌నగర్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం వీఎంఆర్ లాజిక్స్ వారు రూపొందించిన రీజనింగ్ క్లాస్ నోట్స్, అర్థమెటిక్ క్లాస్ నోట్స్, న్యూ ఎడిషన్ బుక్స్‌ను ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వేలకొద్ది ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేసిందని అన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేసుకోకుండా పుస్తకంతో ఎక్కువగా గడపాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే గమ్యాన్ని చేరుకోవచ్చని చూచించారు. కార్యక్రమంలో వీఎఫ్‌జీ చైర్మన్ శ్రీనివాస్, ఏఎస్పీ విజయ్‌కుమార్, వీఎఫ్‌జీ డైరెక్టర్ మనోహర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కారు చిచ్చు!



కొడంగల్‌లో వేడెక్కుతున్న రాజకీయం

- బీఆర్‌ఎస్ టికెట్ తమకే ఇవ్వాలంటున్న గురునాథ్‌రెడ్డి
- మద్దతుదారులతో చర్చించి భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తామని వెల్లడి
- స్థానిక నేతలకే అవకాశం ఇవ్వాలని డిమాండ్
- కేటీఆర్‌తో భేటీ కోసం ఎదురుచూపు

వికారాబాద్: కొడంగల్‌లో గులాబీ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.. మెల్లమెల్లగా కారులో చిచ్చు రగులుతోంది. అధికార పార్టీలో ఇప్పటి వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు.. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కార్యచరణ ప్రకటనతో బహిర్గతమైంది. దీంతో తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకే పరిమితమైన ఇంటిపోరు కొడంగల్‌కు సైతం పాకినట్లయింది. త్వరలోనే మండలాల వారీగా తమ అనుచరులతో సమావేశమై వారి అభిప్రాయాల మేరకు భవిష్యత్ ప్రణాళికను ప్రకటించేందుకు గురునాథ్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఈ నెల 3న మీటింగ్ ఏర్పాటుకు నిర్ణయించగా.. కేటీఆర్ నుంచి వచ్చిన పిలుపు మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. గత సోమవారమే గురునాథ్‌రెడ్డి.. మంత్రి కేటీఆర్‌తో భేటీ కావాల్సి ఉండగా అనివార్య కారణాలతో మీటింగ్ రద్దయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మరో రెండుమూడు రోజుల పాటు వేచిచూసి తమ నిర్ణయం వెల్లడిస్తారని తెలుస్తోంది.

మా పరిస్థితి ఏంటి..?

ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఏపీలో కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన గురునాథ్‌రెడ్డి కొడంగల్ గడ్డపై ఓ వెలుగు వెలిగిన నేత. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 7వేల ఓట్ల తేడాతో, 2014లో టీఆర్‌ఎస్ నుంచి బరిలో దిగి 15 వేల ఓట్లతో రేవంత్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. దీంతో కొడంగల్ గడ్డపై రేవంత్‌రెడ్డిని ఎలాగైనా ఓడించాలని టీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం ఫ్యామిలీ నుంచి నరేందర్‌రెడ్డిని బరిలోకి దింపింది. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ వంటి హేమాహేమీలకు ప్రచార, గెలుపు బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన నరేందర్‌రెడ్డి కొడంగల్‌లో పాతుకుపోయే పనిలో నిమగ్నమయ్యారు. ఫలితంగా దశాబ్దాలుగా తిరుగులేని శక్తిగా కొనసాగిన గురునాథ్‌రెడ్డి రాజకీయంగా వెనుకబాటును ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

టికెట్ ఇస్తేనే కొనసాగుతాం..

ఒక్క చాన్స్ అంటూ కొడంగల్‌లో అడుగుపెట్టిన నరేందర్‌రెడ్డి ఏకు మేకై కూర్చున్నారు. అధికార పార్టీ తరపున ఈసారి కూడా ఆయనే బరిలో ఉంటారనే ఊహాగానాల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు గురునాథ్‌రెడ్డి మద్దతుదారులు రెడీ అవుతున్నారు. అప్పట్లో పార్టీ నిర్ణయానికి కట్టుబడి నరేందర్‌రెడ్డికి అవకాశం ఇచ్చామని, ప్రతీసారి ఆయనే పోటీ చేస్తారంటే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈసారి తన కుమారుడు, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిని రంగంలో దింపాలని గురునాథ్‌రెడ్డి భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ టికెట్ ఇస్తేనే పార్టీలో కొనసాగుతామని, లేదంటే స్వతంత్రఅభ్యర్థిగా పోటీ చేస్తామనే సంకేతాలు ఇస్తున్నారు. 2018లో తాము నిస్వార్థంగా నరేందర్‌రెడ్డికి సపోర్ట్ చేశామని, ఇప్పుడు ఆయన తమకు మద్దతివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అధికార పార్టీలో ఇంటిపోరు జిల్లా మొత్తానికి పాకింది. గతంలో తాండూరు, వికారాబాద్‌కే పరిమితమైన గ్రూపు రాజకీయాలు.. నెమ్మదిగా పెరిగి, కొడంగల్‌కు విస్తరించాయి. ఈసారి బీఆర్‌ఎస్ టికెట్ తమకే ఇవ్వాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఆయన మద్దతుదారులు పట్టుబడుతున్నారు. కాదు.. కూడదూ.. అంటే ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటామనే సంకేతాలిస్తున్నారు.

కేసీఆర్ మాటను గౌరవించాం



గత ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని పెద్దలు కేసీఆర్ చెప్పిన మాటను గౌరవించాం. నరేందర్‌రెడ్డి గెలుపుకోసం కృషిచేశాం. కొడంగల్‌లో కేసీఆర్ గౌరవాన్ని నిలబెట్టినం. ఆయన ఈ తూరిగూడ నాకే ఎమ్మెల్యే టికెట్ కావాలంటే మేమెట్ల ఒప్పుకుంటం. స్థానికులకే టికెట్ ఇవ్వాలని లోకల్ క్యాడర్ కోరుతోంది. ఇచ్చిన మాట ప్రకారం ఈసారి మాకే టికెట్ ఇవ్వాలి. ఎట్టి పరిస్థితిలోనూ మేము ఎమ్మెల్యే బరిలో ఉంటాం.

– గురునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొడంగల్

కొత్త కలెక్టర్‌గా నారాయణ్‌రెడ్డి

కలెక్టర్ నిఖిల బదిలీ



బదిలీ అయిన కలెక్టర్ నిఖిల



నూతన కలెక్టర్ నారాయణ్‌రెడ్డి

వికారాబాద్: జిల్లా కలెక్టర్ నిఖిల బదిలీ అయ్యారు. ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆమెను ట్రాన్స్‌ఫర్ చేయగా.. కొత్త పోస్టింగ్ ఇవ్వలేదు. నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నారాయణ్‌రెడ్డిని వికారాబాద్ కలెక్టర్‌గా నియమించారు. 2021 సెప్టెంబర్ 2న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నిఖిల ఏడాదిన్నర పాటు ఇక్కడ పనిచేశారు. ధరణి సమస్యల పరిష్కారం విషయంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆరు నెలల పాటు ఇద్దరు అడిషనల్ కలెక్టర్లు లేనప్పటికీ అన్నీ తానై బాధ్యతలు నిర్వర్తించారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి



అధికారులతో కలిసి జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: విద్యావంతులు, నిరుద్యోగ యువత ఈ నెల 11న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. ఇండోర్ స్టేడియంలో జాబ్ మేళా ఏర్పాట్లను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద జాబ్ మేళా అని, దాదాపు 108 కంపెనీలు పాల్గొంటాయని, 10వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశం లభిస్తుందన్నారు. 7వ తరగతి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైనవారంతా పాల్గొనవచ్చని సూచించారు. దివ్యాంగ, మూగ, చెవిటి, అంధులు, బధిరులు, ట్రాన్స్‌జెండర్స్ సైతం తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. మేళాలో ఉద్యోగం వచ్చిన వారికి అదే రోజు సాయంత్రం అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఉద్యోగాన్ని బట్టి వేతనం రూ.15వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సెట్విన్ ఎం.డి.వేణుగోపాల్‌రావు, మన్మోహన్, అనంతుల రాజిరెడ్డి, రామాకాంత్, రామ్‌కళ్యాణ్, చంద్రశేఖర్‌రెడ్డి, తిలక్, సుమంత్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు

పార్టీ ప్రతిష్టను కాపాడేందుకే..

- అవిశ్వాసంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాం
- మున్సిపల్ ఛైర్‌పర్సన్లు మంజుల, స్వప్న

వికారాబాద్ అర్బన్/తాండూరు: పార్టీ ప్రతిష్టను కాపాడాలనే ఉద్దేశంతోనే అవిశ్వాసంపై హై కోర్టును ఆశ్రయించామని వికారాబాద్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్లు చిగుళ్లపల్లి మంజుల, తాటికొండ స్వప్న అన్నారు. తమ మద్దతుదారులతో కలిసి మంగళవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. వికారాబాద్ కౌన్సిలర్లు మోముల స్వాతి, అనంతలక్ష్మి, చందర్ నాయక్‌తో కలిసి చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ.. సొంత పార్టీ ప్రజాప్రతినిధులే తమపై అవిశ్వాస తీర్మానం పెట్టి.. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారి కారణంగా సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రతిష్టకు భంగం వాటిల్లకూడదనే ఉద్దేశంతోనే హైకోర్టు నుంచి స్టే తెచ్చామని వెల్లడించారు. ఇందుకు సహకరించిన తెలంగాణ మున్సిపల్ చైర్మన్స్ చాంబర్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుకు ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు. అధిష్టానం నిర్ణయాన్ని ధిక్కరించి మొదటగా వికారాబాద్‌లోనే అవిశ్వాసానికి వెళ్లడం బాధాకరమన్నారు. ఇలాంటి చర్యలతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. తాము పదవి చేపట్టి మూడేళ్లు దాటిందని, ఇప్పటివరకు తమకు సహకరించిన కౌన్సిలర్లు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకమీదట సైతం ఇలాగే సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకే తాము అవిశ్వాసం పెట్టామని, మెజార్టీ కౌన్సిలర్లకు చైర్‌పర్సన్లపై తీవ్ర వ్యతిరేకత ఉందని రెండో వర్గం నేతలు చెబుతున్నారు.

తొర్మామిడిలో ఉద్రిక్తత

- ఎమ్మెల్యేను అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఎస్పీ నేతల యత్నం
- ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు
- సాఫీగా ముగిసిన 'మీతో నేను'



తొర్మామిడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: మండల పరిధిలోని తొర్మామిడిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 'మీతో నేను' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ రానున్నారని తెలుసుకున్న కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేను గ్రామంలోకి రానిచ్చేది లేదంటూ రోడ్డుపై బైఠాయించి, నినాదాలు చేశారు. నాలుగేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో ఆందోళనకారులను అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు. ఆతర్వాత కొద్దిసేపటికి తొర్మామిడి చేరుకున్న ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిరసనకారులను అదుపులోకి తీసుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు

గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. తొర్మామిడి అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు. శాఖల వారీగా పనుల పురోగతిని అధికారులు వివరించారు. విద్యుత్, వ్యవసాయ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తంచేశారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని స్పష్టంచేశారు. తెలంగాణలో ఉన్నన్ని పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్ఫూర్తి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు బల్వంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, యూత్ కమిటీ మండల అధ్యక్షుడు గాలి బల్వంత్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ బాలయ్య, పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డి, ఏఈలు సురేష్‌రెడ్డి, శ్రావణ్, వేణుమాధవ్, ఏఓ సంధ్య, ఎంఈఓ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కంది బోర్డుకు పట్టుబడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- కేంద్రంపై ఒత్తిడి తెస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- తాండూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- పప్పు దినుసులు, నూనె గింజల సాగు పెంచాలని రైతులకు సూచన

తాండూరు: తాండూరులో కంది బోర్డు ఏర్పాటు అంశాన్ని మరోసారి కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ నిఖిలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది పప్పునకు భౌగోళిక గుర్తింపు ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం అంతారంలో నిర్మించిన రైతు వేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఆహార అలవాట్లు మారిన నేపథ్యంలో.. రానున్న రోజుల్లో ఉద్యాన పంటలకు డిమాండ్ పెరగనుందని తెలిపారు. తాండూరు కంది పప్పునకు భౌగోళిక గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని, ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదని తెలిపారు. దీంతో గోదాముల్లో నిల్వలు పేరుకుపోయాయని స్పష్టంచేశారు. వరి, పత్తి సాగును తగ్గించి పప్పు దినుసులు, నూనె గింజల సాగుపై ఆసక్తి చూపాలని సూచించారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పంటకు, ఒక్కో వస్తువుకు ప్రా ముఖ్యత ఉంటుందని చెప్పారు. తాండూరు కంది పప్పు, ఖమ్మం మిర్చీకి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని వివరించారు. ఖమ్మంలో పండిన మిర్చి ఇతర ప్రాంతాల్లో ఎక్కడా పండదని తెలిపారు. చైనాకు చెందిన ఓ వ్యాపారి ఖమ్మంలో పరిశ్రమ ఏర్పాటు చేశాడని తెలిపారు. హైదరాబాద్ ముత్యాలు, బిర్యానీ, అనాబ్‌షాహి అంగూర్ పండ్లు ఎంతో ఫేమస్ అని తెలిపారు. గతంలో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ద్రాక్ష తోటలు విరివిగా కనిపించేవని, రియల్ ఎస్టేట్ పుణ్యమా అని ప్రస్తుతం ఇవన్నీ కనుమరుగయ్యాయని స్పష్టంచేశారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయాలని, అధిక మోతాదులో పురుగు మందులు వాడటం వలన అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని వివరించారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటు అంశాన్ని పలుమార్లు పార్లమెంట్‌లో లేవనెత్తామని తెలిపారు. బోర్డు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, ఎంపీపీలు బాలేశ్వర్‌గుప్త, కరుణ, జెడ్పీటీసీ మంజుల, అధికారులు, ప్రజాప్రతినిధు లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ వీరులకు సన్మానం

షాద్‌నగర్: దేశ సేవలో యువత రాణించాలని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అన్నారు. భారత ప్రభుత్వం అగ్నిపథ్ పథకంలో భాగంగా త్రివిధ దళాల్లో నిర్వహించిన నియామకాల్లో ఎన్నికైన అగ్నిపథ్ వీరులను మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం పని చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. దేశ రక్షణలో నిరుపేద కుటుంబాలకు చెందిన యువత భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యూట్రిషన్ కిట్లు అందజేత

కొడంగల్ : క్షయ బాధితులకు మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్షయవ్యాధిని నివారించవచ్చని టీబీ నివారణ సిబ్బంది సూచించారు. మండల పరిధిలో 29 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నట్లు సంబంధిత సిబ్బంది తెలిపారు. వీరికి పౌష్టికాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.500 నగదు బాధితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. దాతల సాయంతో 29 మందికి ఆరు నెలల పాటు ఉచితంగా న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నట్లు తెలిపారు.

మహాదేవుడికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో శివలింగం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మహాదేవుని ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలధారులు ఉదయం స్వామివారి భజన కీర్తనలతో అలరించారు. అనంతరం శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివాష్టకం, లింగాష్టకం, శివాష్టోత్తర శతనామావళి, ధూపం, దీపం, నైవేద్యం సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. శరణుఘోష, ఖడ్గాలు వేస్తూ స్వామివారిని వేడుకుంటూ మంగళహారతులు అందించారు. అనంతరం వడ్డర్‌గల్లీ కిష్టప్ప ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నదాన(బిక్ష) కార్యక్రమం ఏర్పాటుచేశారు.

బోధన నిలిపివేస్తాం

తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయుల వెల్లడి


అనంతగిరిపల్లిలో హెచ్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: తెలుగు, హిందీ తరగతుల బోధన బుధవారం నుంచి నిలిపివేస్తున్నట్లు తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయుల జేఏసీ జిల్లా ప్రతినిధులు వెంకటేశ్వర్లు, ఎజాజ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, రాజశేఖర్‌లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో భాషాపండితుల పదోన్నతుల విషయంలో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ జేఏసీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేశారు.

'విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి'

చేవెళ్ల: బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్య నా కల అని చెప్పారని, అందుకు తగ్గట్టు నిధులు కేటాయించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. విద్యారంగంలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.


లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న శివ మాలధారులు

శివ మాలధారుల ధర్నా

- దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్
- లక్ష్మీనారాయణపూర్‌లో నిరసన
- తాండూరు–కొడంగల్ మార్గంలో స్తంభించిన ట్రాఫిక్


తాండూరు–కొడంగల్ మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

యాలాల: మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో మంగళవారం సాయంత్రం శివస్వాములు ధర్నాకు దిగారు. దాదాపు గంటకు పైగా ఆందోళనకు దిగడంతో తాండూరు–కొడంగల్ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని దేవనూరుకు చెందిన మెట్లి నరేశ్ సోమవారం అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తితో వ్యక్తిగత విషయమై గొడవ పడ్డాడు. ఆ సమయంలో శివమాల ధారణ చేసిన బి.నరేందర్ వచ్చి నచ్చజెప్పేందుకు యత్నించారు. ఈ క్రమంలో నరేశ్.. నరేందర్‌ను పక్కకు నెటారు. తనను దూషించి నెట్టాడని పేర్కొంటూ నరేందర్ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దాదాపు 200 మందికి పైగా శివ స్వాములు మంగళవారం సాయంత్రం చౌరస్తాకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. శివ మాలధారుడి పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా ఘటన స్థలానికి చేరుకొని ధర్నా విరమించాలని ఆందోళనకారులను కోరారు. సంబంధిత వ్యక్తిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అయితే శివ మాలధారులు యాలాలకు వచ్చి పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. అదే సమయంలో మెట్లి నరేష్ అక్కడికి రావడంతో ఆయనపై దాడికి దిగారు. విషయం తెలుసుకున్న రూరల్, టౌన్ సీఐలు రాంబాబు, రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌లు మాలధారులను చెదరగొట్టారు. కాగా ఘటనకు కారణమైన నరేష్‌తో పాటు దాడికి పాల్పడిన పలువురు స్వాములుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

హామీలు అమలు చేయండి

- వీఆర్‌ఏ సంఘం నాయకుల డిమాండ్
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏ జేఏసీ నాయకులు

కొడంగల్ రూరల్ : వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సంఘం జిల్లా కో చైర్మన్, జిల్లా అధ్యక్షుడు టి.గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బుచ్చయ్యకు వినతిపత్రం అందించారు. వీఆర్‌ఏ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు 1వ, 2వ తేదీలలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు దగ్గర జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మౌనదీక్షకు తరలివెళ్తున్నట్లు గోపాల్ తెలిపారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. పే స్కేల్ జీఓను విడుదల చేస్తూ అమలుచేయాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, 55ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానంలో వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రవీణ్, సంధ్యారాణి, మోహన్, ఆంజనేయులు, బాబు, ఆనంద్, భానుప్రసాద్, వెంకటయ్య తదితరులు తరలివెళ్లారు.

కరాటేలో మర్పల్లి విద్యార్థుల ప్రతిభ

మర్పల్లి: ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మర్పల్లి విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల నగరంలో 6, 9, 10వ తరగతి విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించినట్లు మాస్టర్ నర్సింహులు తెలిపారు. ఈ పోటీల్లో కోట్‌మర్పల్లి పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు రిషి స్పైరింగ్‌లో గోల్డ్ మెడల్, అభిలాస్ కటాస్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. 9వ 10వ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు మొదటి, రెండో బహుమతులు సాధించారన్నారు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాలలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు.


విద్యార్థులను సన్మానిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు


బోనాలతో తరలివస్తున్న మహిళలు

బోనం.. శోభాయమానం

ధారూరు మండలం దోర్నాల్‌లో సోమ, మంగళవారాల్లో గ్రామ దేవతలైన మైసమ్మ, ఊరడమ్మ, పోషమ్మల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి చల్లంగా చూడమ్మ అంటూ వేడుకున్నారు. సాయంత్రం ఏర్పులమ్మ భవిష్యవాణి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. - ధారూరు


బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు

అక్రమ బదిలీలకు అడ్డాగా మారింది

ఎస్టీయూ జిల్లా అధ్యక్షురాలు రాజమణి

తుక్కుగూడ: ఉపాధ్యాయుల బదిలీల విషయంలో రంగారెడ్డి జిల్లా అక్రమ బదిలీలకు అడ్డాగా మారిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షురాలు సుంకరి రాజమణి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఆరోపించారు. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా లేకపోయినా వాటిని భర్తీ చేయడం ప్రభుత్వ పరాకాష్టకు నిదర్శనమన్నారు. నాదర్‌గుల్, సరూర్‌నగర్ పాఠశాలల్లో ఫిజికల్ సైన్స్ పోస్టులు ఖాళీ లేకున్నా ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని భర్తీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా


మాట్లాడుతున్న భుజంగరావు

అనంతగిరి: మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, తనను గెలిపించాలని అభ్యర్థి భుజంగరావు కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన వికారాబాద్ పట్టణం, మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆయన ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వేణుగోపాల్,బసిరెడ్డి, దయాకర్, అంజిలయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రక్షణకు శిక్షణ

- బాలికలకు కరాటేలో తర్ఫీదు
- రంగారెడ్డి జిల్లాలో 305 పాఠశాలల ఎంపిక
- శిక్షణ కోసం రూ.15.25 లక్షలు కేటాయింపు

కద్తాల్: పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు.. వేధింపుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు పాఠశాలల్లో చదివే బాలికలకు స్వీయరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాణీలక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్స్ ఫర్ గర్ల్ కింద జిల్లాలో బాలికలు అధికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, కేజీబీవీ పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో బాలికల ఆత్మరక్షణకు ఉపయోగపడేలా కరాటేలో శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా లాంఛనంగా కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణతో బాలికల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే పలు పాఠశాలల్లో ప్రారంభం..

జిల్లాలో అత్యధికంగా బాలికలు ఉన్న జెడ్పీ హైస్కూల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలు, కేజీబీవీల్లో మొత్తం 305 పాఠశాలలను కరాటే శిక్షణకు ఎంపిక చేశారు.


కరాటేలో శిక్షణ పొందుతున్న బాలికలు

- జిల్లాలో ఇప్పటికే 275 పాఠశాలల్లో శిక్షణ ప్రారంభమైంది.
- బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ, జూడో వంటి రక్షణ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.
- పాఠశాలకు రూ.5 వేల చొప్పున, 305 పాఠశాలలకు రూ.15.25 లక్షలు కేటాయించారు.
- ఇందులో నుంచి శిక్షణ మాస్టర్లకు వేతనం చెల్లించనున్నారు.
- ఫిబ్రవరి 23 వరకు శిక్షణ కొనసాగనుంది.

మనోధైర్యం పెరుగుతుంది..



కరాటే శిక్షణతో బాలికల్లో మనోధైర్యం, ఆత్మ విశ్వాసం పెరుగుతాయి. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. బాలికలు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. అన్ని రంగాల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి.

– అనిత, ఎస్‌ఓ, కద్తాల్, కేజీబీవీ

సద్వినియోగం చేసుకోవాలి



కరాటే శిక్షణను ఆయా పాఠశాలల్లో చదివే బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయిలోనే శిక్షణ పొందడం ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఏకాగ్రత పెరగడంతోపాటు తమను తాము రక్షించుకుంటామనే నమ్మకం, ధృఢ సంకల్పం కలుగుతాయి.

– సర్దార్‌నాయక్, ఎంఈఓ, కద్తాల్

కరెంటు కోతలపై బీజేపీ ధర్నా


దౌల్తాబాద్‌లో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దౌల్తాబాద్: అప్రకటిత కరెంట్ కోతలను నిరసిస్తూ బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు కూర వెంకటయ్య మాట్లాడుతూ రైతుల పొలాలకు అందించే విద్యుత్ సరఫరాలో ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తున్నారని అన్నారు. దీంతో మడులు సైతం తడవక పంటలు ఎండుతున్నాయని అన్నారు. ప్రస్తుతం వరి పంటలు ఎండుముఖం పడుతున్నాయని అన్నారు. అలాగే ఏసీడీ ఛార్జీలతో అధిక బిల్లులు వసూలు చేయడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. అనంతరం ఏఈ మహిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాలూకా కన్వీనర్ నర్సింహులు, మొహన్‌రెడ్డి, రాములు, లక్ష్మి, సావిత్రమ్మ తదితరులున్నారు.

లేగదూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

కేశంపేట: పాడి రైతులు పశువులకు సోకే వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అంజిలప్ప సూచించారు. మండల కేంద్రంలో పశువైద్యశాఖ అధ్వర్యంలో మంగళవారం టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4 నుంచి 9 నెలల వరకు ఉన్న లేగదూడలకు ప్రభుత్వం బ్రూ సెలోసిస్ వ్యాధి టీకాలను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నివేదిత, జూనియర్ పశు వైద్యాధికారి రాజీవ్ పైలెట్, మోసిన్, రాఘవేందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ జీడీ సతీశ్‌కుమార్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్


ముద్దెంగూడలో తెల్ల కుసుమ పంటను పరిశీలిస్తున్న డాక్టర్ జీడీ సతీశ్‌కుమార్, రత్నాకర్, రైతులు

చేవెళ్ల: నూనెగింజల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ జీడీ సతీశ్‌కుమార్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. మంగళవారం వారు మండల పరిధిలో రైతులు సాగు చేసిన తెల్ల కుసుమ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీడీ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. నూనె గింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా గతేడాది అక్టోబర్‌లో ముద్దెంగూడ, తిర్మలాపూర్, ఎర్రోనిగూడ, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ గ్రామాల్లో 180 మంది రైతులకు అధిక దిగుబడినిచ్చే ఐఎస్‌ఎఫ్–746 రకం కుసుమ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. సంప్రదాయ విత్తనాలకు, భారతీయ నూనె గింజల పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ వారు అభివృద్ధి చేసిన విత్తనాలకు పంట ఎదుగుదల, దిగుబడి విషయంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న కుసుమ పంటకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. మార్కెట్‌లో నూనెల ధరలు ఆకాశాన్నంటినందున రైతులు నూనె గింజల పంట సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రైతులు సంఘంగా ఏర్పడి కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, రుణాలు యంత్రాలు సమకూర్చుకోవాలని చెప్పారు. విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం, పండించిన పంటకు ధర నిర్ణయించడంలాంటి కార్యక్రమాల నిర్వహణతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు ప్రకృతి, సేంద్రియ పద్ధతులను ఉపయోగించి కూరగాయలు, పండ్లు ఆహార పదార్థాలను పండించాలన్నారు. దీంతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా నాణ్యమైన రసాయన రహిత పంటలు పండించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గోపాల్‌రెడ్డి, ఆంజయ్య, సాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనంతరెడ్డి తదితరులున్నారు.